స్మశానంలో పనిచేయని బోరు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం నరసరాజు చెరువు స్మశానం లో చేతి బోరు పని చేయకపోవడంతో అంత్య క్రియలకు వచ్చేవారు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో చనిపోయిన వారిని అంత్యక్రియలు నిర్వహించుటకు నీటి సదుపాయం లేక మృతదేహం ఖర్మ కాండలు నిర్వహించటకు బంధువులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, దాతలు తక్షణమే స్పందించి, నర్సరాజు చెరువు స్మశానములో ఉన్న బోరు పని చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు వారు కోరుతున్నారు.

జాతీయ మానవ హక్కుల కౌన్సెల్ ప్రోగ్రాం కార్యదర్శిగా జోగ తరుణ్‌తేజ నియమాకం

విశాలాంధ్ర-చోడవరం : జాతీయ మానవ హక్కుల కౌన్సెల్ (విశాఖపట్నం) సంస్థ ప్రోగ్రాం కార్యదర్శిగా చోడవరంకు చెందిన జోగ తరుణ్ తేజను నియమించినట్లు సంస్థ ప్రాంతీయ చైర్మన్ దేవరపల్లి నవ కుమార్ మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల సంస్థ (ఎన్.హెచ్.ఆర్.సి) చైర్మన్ డాక్టర్ పలక సంపత్ కుమార్ చోడవరం నియోజకవర్గప్రోగ్రామ్ కార్యదర్శిగా తరుణ్ తేజ కు నియమాక పత్రం అందజేసినట్లు తెలిపారు. చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండల పరిధిలో రెండేళ్ల పాటు ప్రోగ్రామ్ కార్యదర్శిగా పనిచేస్తారన్నారు. సంస్థకు కార్యదర్శిగా నియమింపబడిన తేజ మాట్లాడుతూ సంస్థ ప్రతిష్టకు భంగం కలుగకుండా, శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. తన మీద నమ్మకంతో ఈ పదవిని ఇచ్చినందుకు జాతీయ చైర్మన్ సంపత్ కుమార్, జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు ప్రాంతీయ చైర్మెన్ నవకుమార్, వివిధ హెూదాలలో ఉన్న సంస్థ ప్రతినిధులకు, సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. నూతన ప్రోగ్రామ్ సెక్రటరీ జోగ తరుణ్ మాట్లాడుతూ పేద, కార్మిక, కర్షక వర్గాల వారికి అందుబాటులో వుంటూ సంస్థ ద్వారా వారికి అవసరమగు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలియజేశారు.

వీగిపోయిన యలమంచిలి మున్సిపల్ అవిశ్వాస తీర్మానం

విశాలాంధ్ర-యలమంచిలి : జిల్లాలో రాజకీయ ప్రాధా న్యత కలిగిన యలమంచిలి మున్సిపాలిటీలో చైర్ పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో ఉత్కంతతకు తెరపడింది. చైర్పర్సన్ పిల్ల రమా కుమారి పై వైసీపీ పార్టీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మంగళవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నర్సీపట్నం ఆర్డిఓ వివి.రమణ ప్రిసైడింగ్ అధికారిగా మున్సిపల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గత నెల 27వ తేదీన 18 మంది వైసీపీ పార్టీ కౌన్సిలర్లు చైర్ పర్సన్ రమాకుమారిపై అవిశ్వాస తీర్మానం నోటీసును అధికారులకు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మంగళవారం అవిశ్వాస తీర్మానం నోటీసు పై మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నర్సీపట్నం ఆర్డీవో సమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు ఒక్క కౌన్సిలర్ హాజరు కాకపోవడంతో సమావేశాన్ని 12 గంటలకు వాయిదా వేశారు. అయినప్పటికీ ఏ ఒక్క కౌన్సిలర్ కూడా ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కాకపోవడంతో చైర్ పర్సన్ రమాకుమారిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు నర్సీపట్నం ఆర్డివో వివి రమణ ప్రకటించారు. దీంతో చైర్ పర్సన్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి తెరపడినట్లు అయింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, యలమంచిలి సిఐ ధనుంజయ రావు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం ఈ అవిశ్వాసం గెలుపు

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

విశాలాంధ్ర-యలమంచిలి : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ కొద్ది రోజుల్లోనే అభివృద్ధి చేసి చూపించడం దానికి నిదర్శనంగా నిన్న జీవీఎంసీ ఈరోజు యలమంచిలి మున్సిపాలిటి పాలకవర్గాలు అవిశ్వాసంలో గెలుపు బాటలో నడిచారని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం నాడు యలమంచిలి మున్సిపాలిటీలో జరిగిన అవిశ్వాస తీర్మానం కు ఎవరు హాజరు కాకపోవడంతో గత చైర్పర్సన్ కొనసాగుతారని రిటర్నింగ్ ఆఫీసర్ వివి రమణ ప్రకటించడంతో అవిశ్వాసం చిక్కుముడి వీడినట్లు అయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో మూడు సంవత్సరాల నుండి మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని, ఏడాదిలోగానే కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని, కూటమి ప్రభుత్వం మాటలు చెప్పకుండా చేసి చూపిస్తుందని ప్రజలు కూటమికే జేజేలు కొట్టడంతో అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు కూడా కూటమి వైపే మగ్గుచూపి గెలుపు బాటలో నడిపారని విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి రాజన సన్యాసినాయుడు, కూటమి నాయకులు శ్రీ రామదాసు, బొద్దపు శివ, అన్నం బాబ్జి, సోమినాయుడు, రమేష్, సతీషు, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాగృతి సంస్థ ఆధ్వర్యంలో బాధితునికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

విశాలాంధ్ర-సబ్బవరం: జాగృతి సంస్థలో పొదుపు చేస్తున్న సభ్యులందరికి, సంస్థ ఆర్థికంగా ఏదైనా భరోసా కల్పించాలనే దృఢ సంకల్పంతో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత జాగృతి సంస్థ పాలక వర్గ సభ్యులతో చర్చించి, సభ్యులందరికి హెచ్‌డిఎఫ్‌సి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. అందులో భాగంగా పెదమూషిడివాడ గ్రామ-జాగృతి సంస్థ సభ్యురాలైన తేలు అచ్చియమ్మ భర్త గంగరాజు ఇటావలి మరణించగా వారి కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా నామినీ అయినా ఆమె కుమార్తె కోసూరు లక్ష్మి కి,జాగృతి సంస్థ ద్వారా లక్ష రూపాయిలు జాగృతి సంస్థ పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రతినిధుల చేతుల మీదిగా ఇన్సూరెన్స్ చెక్ ను అందజేయ్యడం అయినది,ఈ కార్యక్రమానికి జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత , సంస్థ సీఈఓ కుమారి కె.ఎల్.ఎన్ .మౌక్తిక ,సంస్థ పాలక వర్గ సభ్యులు నంబారు సూర్యనారాయణ,గుర్రం అప్పలనర్సమ్మ, కోట్ని అమ్మతల్లి నాయుడు, కాపుశెట్టి రమణమ్మ,మాటూరి ఉమా, కర్రి సంతోష్ రామలక్ష్మి, మారేడుపూడి అబద్ధం, కొెతాన సుజాత మరియు గ్రామ ప్రతినిధులైన బలిరెడ్డి సరోజినీ, కరెడ్ల ఉమాదేవి, చోచ్చుపల్ల జ్యోతి, పిళ్ల హైమావతి జాగృతి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శివకోటి శరణ్య(20 సంవత్సరాలు), భర్త దుర్గాశంకర్ ప్రసాద్ తాను మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త డ్యూటీకి వెళ్లిన తర్వాత ఈ సంఘటన జరిగింది. ఆమె ఆత్మహత్యకు గల కారణం గురించి కుటుంబ సభ్యులను ప్రశ్నించగా, ఆమె తల్లి అప్పికొండ నాగమణి వివరణ ఇస్తూ... కుమార్తె శరణ్య, శివకోటి దుర్గాశంకర్ ప్రసాద్‌ను 20.02.2025న కుటుంబ పెద్దల సమక్షంలో స్వయంగా అంగీకరించి వివాహం చేసుకున్నదని చెప్పారు. అయితే వివాహం జరిగిన తర్వాత శరణ్య అంత సక్యతగా ఉండేది కాదని, ఆమెకు కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయని చెప్పారు. ఇదే విషయాన్ని ఆమె భర్త కూడా చెప్పాడని పేర్కొన్నారు. 22.04.2025 ఉదయం ఆమె తల్లి ఇంటికి వచ్చి ఏవైనా సమస్యలుంటే చెప్పమని కోరినప్పటికీ శరణ్య ఏమీ చెప్పలేదని ఆమె తెలిపింది. అనంతరం ఆమె భర్త హాస్పిటల్, అనకాపల్లికి డ్యూటీకి వెళ్లిన తర్వాత శరణ్య ఈ చర్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. కుటుంబసభ్యులు ఆమె మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని తెలిపారు.

సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో జెడ్.చింతువా పంచాయతీ లోవపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ఎరిపల్లి అజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకున్న ప్రతీ ఒక్కరికీ ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షలు,సాధారణ మరణానికి రూ.10 వేలు పార్టీ ఇవ్వడంతో పాటూ సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తల పిల్లల చదువులు విషయంలోనూ సహాయం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎరిపల్లి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకుడు పిల్లి సహదేవుడు,గనగళ్ళ కోదండరామ్,ఎరిపిల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. రాష్ట్రంలో ఉన్న పాఠశాలల్లో సమూలమైన మార్పులు చేపడుతున్న మంత్రి నారా లోకేష్ అస్తవ్యస్తంగా ఉన్న విద్యావ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. మంగళవారం కింతాడ పంచాయతీ బొట్టవాని పాలెం కింతాడ బత్తివానిపాలెం గొల్లల పాలెం పాఠశాలల్లో నూతనంగా నిర్మించిన ప్రహరీలను, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో కోటి 32 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ డార్మెటరీ అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ ఇన్చార్జి కన్నూరు సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం కోసం ప్రభుత్వం 19 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో ఒక్క మాడుగుల నియోజకవర్గానికే 10 కోట్ల రూపాయలు నిధులు సాధించిన్నట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాలు జరుగుతున్నాయి అన్నారు. అర్హత గల ఉపాధ్యాయులు మంచి బోధన అందిస్తున్నారని, అటువంటప్పుడు ప్రైవేటు పాఠశాలల్లో చదవాల్సిన అవసరం ఏం వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటిగా అతి తక్కువ సమయంలో కంప్యూటర్ డార్మెటరీ గదులను నిర్మించిన ఘనత గొల్లలపాలెం కేజీబీవీ పాఠశాలకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుంది అన్నారు. ఈ విషయంలో ప్రజలు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ పివిజి కుమార్, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి ఏసుదాసు తెలుగుదేశం నాయకులు రొంగలి మహేష్, దాడి ఎరుకనాయుడు, సబ్బవరపు రామనాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, భత్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులకు సభ్యత్వ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-నాతవరం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు, నాయకులకు సభ్యత్వ కార్డులను మంగళవారం నాతవరం మండలం మర్రిపాలెం గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ,పార్టీ మండల అధ్యక్షుడు 'నందిపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని మండలాలలో మన నాతవరం మండలంలోనే అత్యధికంగా 12 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని, ఇంతకుముందు అయితే కార్డులు నాయకులు తీసుకొని పంపిణీ చేయకుండా తమ వద్ద ఉంచుకొనే వారిని, ఇప్పుడలా జరగకుండా అత్యాధునిక టెక్నాలజీని మన పార్టీ తీసుకువచ్చిందని, మీరు ప్రతీ కార్డు వారి ఇంటికి తీసుకొని వెళ్లి మీ మొబైల్ లో స్కాన్ చేసి ఇవ్వాలని, అలా మీరు ఎంత మందికి ఇచ్చారో పార్టీ సెంట్రల్ ఆఫీసులో చూపిస్తుందని, ఆ లిస్ట్ సెంట్రల్ ఆఫీస్ నుండి మన ఆఫీస్ కి వస్తుంది అని, మన పార్టీ తరపున ఏ కార్యక్రమం చేసినా, పార్టీ ఏ లక్ష్యాన్నయితే నిర్దేశించిందో, ఎలా చేయమందో ఖచ్చితంగా చేయవలసిన బాధ్యత మనపై ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు(బాబులు), నేతల విజయ్ కుమార్, పార్టీ మండల జనరల్ సెక్రటరీ అప్పన విజయ్ కుమార్, మండల వైస్ ప్రెసిడెంట్ జీవిరెడ్డి రాజబాబు, అనకాపల్లి పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ఇటంశెట్టి సీతారాం, స్టేట్ %బాజ% మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడయ్య(చిన్నా), తెలుగు మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు సూరిబాబు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-కోటవురట్ల : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. విద్య, ఉపాధి హామీ, రెవిన్యూ, ఆర్డబ్ల్యూఎస్ వంటి శాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు సభలో అధికారులను నిలదీశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంశాలు వారీగా చర్చ ప్రారంభించారు. ఆర్డబ్ల్యూఎస్ పనితీరు సక్రమంగా లేదని నీటి సరఫరా వాటర్ ట్యాంకుల నిర్మాణం వంటి వాటిపై ప్రజా ప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వట్లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలిగుంట గ్రామంలో ఈ వారం ఉపాధి పనులు నిలిపివేయడంపై గ్రామ సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. నీలుగుంట గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో మరో గ్రామానికి చెందిన వ్యక్తికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ అతనిపై సర్పంచ్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సబువని బికేపల్లి సర్పంచ్ లింగం నాయుడు సభలో ప్రశ్నించారు.దీంతో సభలో ఇరువురి మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఎంపీడీవో కాశీ విశ్వనాథ రావు కలగజేసుకొని గ్రామంలో ఉపాధి పనుల జరిగాలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో గొడవ సద్దుమణిగింది. చౌడువాడ గ్రామానికి చెందిన చెరువు కబ్జాకు గురైందని కబ్జాదారులకు నోటీసులు ఇచ్చి చెరువుని సంరక్షించాలని సర్పంచ్ గోపాలకృష్ణ సభలో కోరారు. దీంతో తహసిల్దార్ తిరుమల బాబు కబ్జాదారులను ఇప్పటికే పిలిపించి మాట్లాడానని వారందరికీ నోటీసులు అందజేసి రూల్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటానని సభలో తెలిపారు. రేషన్ కార్డ్ దారులు అందరూ తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలన్నారు. కేవైసీ నమోదు కాని వారికి రేషన్ నిలిపివేస్తారని తెలిపారు. కైలాసపట్నం గ్రామంలో బాణసంచా పేలుడు ఘటనలో మరణించిన పదిమందిలో ఎనిమిది మందికి 15 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించడం జరిగిందన్నారు. గాయపడిన వారికి లక్ష రూపాయలు అందించామన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారందరికీ 50 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ప్రకటించేలా సభ తీర్మానం చేయాలని జెడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి సభలో కోరారు. కైలాసపట్నంలో జరిగిన ఘటనలో మరణించిన వారిపట్ల సభ విచారం వ్యక్తం చేసింది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్, వ్యవసాయం, వెలుగు, అటవీశాఖ, ఇరిగేషన్, గృహ నిర్మాణం వంటి శాఖల పనితీరుపై సభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడుబాబురాజు, ఈవో పి ఆర్ రఘురాం, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా పర్యటనలు విద్యార్థుల్లో పరిశీలనా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి

జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు

విశాలాంధ్ర-అనకాపల్లి : విద్యా పర్యటనలు విద్యార్థులలో పరిశీలన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి గుడ్డి అప్పారావు నాయుడు అన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధ్యయన, అవగాహన పర్యటనను మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా పర్యటనలు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించడం ద్వారా వారి అభ్యాసనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా చేస్తాయని, విద్యా పర్యటనలు విద్యార్థులకు పుస్తకాల్లో చదివిన విషయాలను నిజ జీవితంలో చూడటానికి, అనుభవించడానికి సహాయ పడతాయి అన్నారు. ఇది వారి జ్ఞానాన్ని బలపరుస్తుందని, వారిలో పరిశీలనా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. జిల్లా లో వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి సుమారు 96 మంది విద్యార్థిని విద్యార్థులు, 15 మంది గైడ్ టీచర్లతో పాటు జిల్లా సైన్స్ అధికారి, ఏఎంఓ ఈ టూర్‌లో ఉండాలని తెలిపారు. ఈ టూర్‌లో విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీలో గల న్యూక్లియర్ ఫిజిక్స్ ల్యాబ్, ఫిజిక్స్ డిపార్ట్మెంట్, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ బోటనీ, జూవాలజీ లాబ్స్ సందర్శించి, తదుపరి విశాఖ బీచ్ లో గల సబ్మెరైన్ , టి20 ఎయిర్ క్రాఫ్ట్‌ను, విశాఖ మ్యూజియంని కూడా సందర్శిస్తారని తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం జనవరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన చేసిన 96 మంది విద్యార్థులను ఉత్తమ ఉపాధ్యాయులను రెండు ఆర్టీసీ బస్సులలో విశాఖపట్నం వైజ్ఞానిక యాత్ర కి పంపించడం జరిగిందని తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ డి.కాళిదాస్, మురళీమోహన్, పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ స్టడీ టూర్ విజయవంతంగా పూర్తయిందని తెలిపారు.

గురుకులంలో 13 మంది విద్యార్థులకు, ఒక ఉపాధ్యాయునికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో మంగళవారం తెలుగు బుక్ ఆఫ్ ప్రతినిధి వి. వి బుచ్చిరాజు ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థులు మరియు ఒక ఉపాధ్యాయుడు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ తెలిపారు. వీరు పిరియాడిక్ టేబుల్ ని, ఫిజిక్స్ కాన్స్టెంట్ వాల్యూస్, ఫిజిక్స్ ఫార్ములాస్, కెమిస్ట్రీ ఫార్ములాస్ నీ అతి తక్కువ టైంలో చెప్పినారు. ఈ కార్యక్రమానికి సబ్బవరం తాసిల్దార్ బి.చిన్ని కృష్ణ, సబ్బవరం సి ఐ పి.రమణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు . గతంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో పిరియాడిక్ టేబుల్ ని 22 సెకండ్స్ లో చెప్పినారు, 13 మందిలో ముగ్గురు విద్యార్థులు జె.నిశాల్ 16 సెకండ్ లోనూ డి. విశ్వనాథ్ 18 సెకండ్ లోనూ,బి .మనోహర్ష 19 సెకండ్ లోను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును అధిక మించినారు, ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ వీటి మీద పట్టు సాధించడం ద్వారా రేపు నీట్ రాసి డాక్టర్ సీటు సాధించాలన్న, ఐఐటి జేఈఈ రాసి ఇంజనీరింగ్ సాధించాలన్న ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి అని అన్నారు, సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ విద్యార్థులను ఇలాంటి పోటీల్లో రాణించడం ద్వారా వారికి టైం యొక్క విలువ తెలుస్తుందని అన్నారు, అనంతరం తెలుగు బుక్ రికార్డ్స్ లో విజయం సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు వారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ లెక్చరర్ వి .వి .జె వేణుగోపాలరావు, వెల్ఫేర్ ఇంజనీరింగ్ కాలేజీ కెమిస్ట్రీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ కే. జయరావు, గురుకులం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

విశాలాంధ్ర-మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేసవికాలంలో మంచి నీరు అందించే ఉద్దేశంతో మునగపాక మండల పశు వైద్యాధికారి ఆర్.ఎం ప్రదీప్ చొరవతో విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు సుమారు 60 వేల రూపాయల ఆర్ఓ వాటర్ ప్యూరిఫైయర్ ను మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందజేశారు. ప్యూరిఫైయర్ రావడానికి కారణం అయిన మండల పరిషత్ పశువైద్యాధికారి ఆర్ఎం ప్రదీప్ ను ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ సభ్యులు ప్రదీప్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏబీఎమ్ కే.రంగా చారి, టీఓ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి పూర్ణచంద్ర రామారావు,దాడి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 171 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-అనకాపల్లి : స్థానిక ఆదినారాయణ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవింద రావు మాట్లాడుతూ. జాబ్ మేళాకు సుమారుగా 15 ఎమ్మెల్సీ కంపెనీలు హాజరయ్యాయని, వివిధ కంపెనీలలో ఉన్న 1100 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని, ఈ జాబ్ మేళాకు 10వ తరగతి నుండి పీజీ వరకు (ఐటి డిప్లమో, బీటెక్, బిబిఏఎం, బి.ఏ, బీకాం, బీఎస్సీ) అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారని తెలిపారు. స్థానికంగా కానీ ఇతర ప్రదేశాల్లో ఉద్యోగ అవకాసం పొందినటువంటి వారు నియామకం పత్రం తీసుకున్న ఆ కంపెనీలో జాయిన్ అయ్యి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. జాబ్‌మేలాలో 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయని 455 మంది నిరోద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారని, 171 మంది వివిధ కంపెనీ లకు ఎంపిక కావటం జరిగిందని, సుమారు 50 మందికి ఉద్యోగ మేళా నిర్వహించిన చోటే ఉద్యోగ నియామక పత్రాలు అందిచటం జరిగింధని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో పెదగుమ్ములూరు సమీపంలో ప్రకారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు .స్థానిక ఎస్సై ఏ .విభూషణరావు అందించిన వివరాల ప్రకారం నర్సీపట్నం ఏరియా నుంచి ద్విచక్ర వాహనంపై తుని ప్రాంతానికి చెందిన కప్పరాతి శ్రీను,రామిశెట్టి సాయిబాబా అనే వ్యక్తులు గంజాయి వినియోగం అలవాటు ఉండటంతో ఏ ఎస్ ఆర్ జిల్లా అన్నవరం ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకొని వస్తుంది గా తమ సిబ్బంది పట్టుకున్నారని వెల్లడించారు వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచినట్లు తెలిపారు.

వాహన తనిఖీలు నిర్వహణ

విశాలాంధ్ర-కశింకోట : కశింకోట జంక్షన్‌లో సీఐ అల్లు స్వామి నాయుడు మరియు ఎస్ఐ మనోజ్ కుమార్ నేతృత్వంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో వాహనదారులకు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడం గురించి అవగాహన కల్పించారు. ఇటీవల పెరిగిన చలానాలపై కూడా స్థానిక ప్రజలకు వివరించారు. కొత్త చలానాల విధానం ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో భారీ జరిమానాలు విధించబడతాయని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాణాలను రక్షించుకోవడం కోసం, చట్టాలను గౌరవిస్తూ నిబంధనలు పాటించాలని కోరారు. కశింకోట పోలీసులు ఈ తనిఖీలను నిరంతరం కొనసాగించనున్నారని పేర్కొన్నారు.

ఇంటిపై సోలార్ విద్యుత్ ఏర్పాటుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-యస్.రాయవరం : ప్రధాన మంత్రి సూర్యగర్ యోజన పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మరింత సులభం గా సోలార్ ఏర్పాటు చేసేందుకు ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ,సర్పంచులు ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశ నమోదుకు ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ను నూతనంగా ప్రవేశం చేసేందుకు నమోదు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు స్థానిక ఎంఈఓ-1 ఎస్.లక్ష్మణరావు,ఎం ఈ ఓ -2 ఎం.జె.రవీంద్రబాబు లు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. అంగనవాడి కేంద్రాలను లలో ఐదు సంవత్సరాల నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలోనూ, ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల లోను,అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాలలలో ఏడవ తరగతి విద్యను పూర్తి చేసుకున్న వారికి ఉన్నత పాఠశాలలోనూ చేర్పించుటకు ప్రత్యేక డ్రైవ్ చేసినట్లు వారు తెలిపారు. విద్యార్థులకు యు డైస్ పోర్టల్ లో అడ్మిషన్లు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ప్రతి విద్యార్థి విద్యభ్యాసాలను ఆటంకం పరచకుండా తగు పరివేక్షణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు.

ఘనంగా మోద కొండమ్మ పండుగ

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, యడ్ల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం 108 ఘటాల మాడుగుల మోదకొండమ్మ పండుగలో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలు శిరస్సున ధరించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సతీమణి బూడి రమణమ్మ, మండల పరిషత్ అధ్యక్షులు రాజారామ్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించండి

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల నియోజకవర్గంలో ఆదివాసి గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించి డోలిమోతలు అరికట్టాలాని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ అధికారం వస్తే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గిరిజనులు నమ్మి ఓట్లు వేసారని తెలిపారు పవన్ కల్యాణ్ ఏజెన్సీ పర్యటన సందర్భంగా వచ్చి వెళ్ళిన తరువాత గిరిజనులకు చెప్పులు పంపిణీ చేయడం పట్ల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మీకు ఓట్లు వేసినందుకు మేము చెప్పుతో కొట్టుకునేందుకు చెప్పులు పంపించారా అని ప్రశ్నించారు? గిరిజన గ్రామాలకు వెంటనే రోడ్లు సౌకర్యం కల్పించి డోలిమోతలు అరికట్టలాని డిమాండ్ చేశారు. శంకరం పంచాయతీలోని అసంపూర్తిగా నిలిచి పోయిన గ్రామాలైన తాడివలస. గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించి కొత్తవలస తాడి వలస గెడ్డలపై రెండు బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నికల ముందు ఈగ్రామాలకు రోడ్లు సౌకర్యం కల్పించాలని 9.20 కోట్ల 30లక్షల రూపాయలుతో రోడ్లు బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు, నమ్మబలికి ఎన్నికల అయి తొమ్మిది నెలలు అవుతున్న కనీసం పట్టించు కోలేదన్నారు, వర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్భిణీలను, బాలింతలను డోలిలు కట్టి మోసుకు వస్తున్నారని తెలిపారు పిల్లలు స్కూలుకు వెళ్ళలాన్న ముసలి వారు ఆసుపత్రికి వెల్లాలాన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. గొటివాడ నుండి కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస మీదుగా రాయిపాలెం, రాజంపేట మీదుగా కృష్ణంపాలెం తారురోడ్డు వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తె వందలాది మంది గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించ వచ్చునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ఓక్క గిరిజన గ్రామం ఉన్న రోడ్డు సౌకర్యం కల్పిస్తామని పవన్ కల్యాణ్ వాగ్దానం నెరవేరలేదన్నారు కూటమి ప్రభుత్వ లోని ఎమ్మెల్యే యంపి లు స్థానికులు కావక పోవడం ఇక్కడ గిరిజనులు సమస్యలు తెలియక పోవడం అవగాహనా లేక పోవడం గిరిజను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత సంవత్సరం కొత్తవలస గెడ్డ దాట లేక 108 గెడ్డ దాటలేక అక్కడి అక్కడె గిరిజనుడు చనిపోయారని తెలిపారు. తాడివలస గెడ్డ దాటలేక గర్భిణీ గెడ్డలోనే ప్రసవించిందని తెలిపారు. వర్షకాలం వస్తే గెడ్డలు దాటలెక రోడ్లు సౌకర్యాలు లేక 108, 104 వంటి సౌకర్యాలు పూర్తిగా ఉండటం లేదన్నారు. తాడిపర్తి పంచాయతీ అజయ్ పురం కోత్తూరు చుట్టూ గెడ్డ రాస గోప్పూరు సిరిపురం, చిన పిట్టగెడ్డ, కోండవీది పెద గోర్రిగెడ్డ చిన గోర్రిగెడ్డ పసువుల భంద కోనాం పంచాయతీ రేళ్ళల పాలెం, చేరుగుబిల్లి మళ్ళీపాడు జూజులపాలెం,బందవీది కోత్తవీది, జయపురం గిరిజన గ్రామాలకు డోలిమోతలు తప్పడం లేదన్నారు, చింతలపూడి పంచాయతీ లోని బోడిగరువు నేరేళ్ళపూడి మదన గరువు గిరిజన గ్రామాలకు ట్రైబల్ డవలాప్ మెంట్ అభివృద్ధి నిధులతో రెండు కోట్లు కేటాయించిన కోంతమేరకు పనులు జరిగాయి ఇవి కూడ అసంపూర్తిగా నిలిచి పోయాయి గర్సింగి పంచాయతీలో కించుమండకు నేటికీ ఎటువంటి రోడ్డు సౌకర్యం లెదు తరాలు మారినా తాతలు మాలిన గిరిజనులు తల రాతలు మాత్రం మారడం లెదన్నారు, అడవిలో జంతువులకు ఉన్న విలువైన గిరిజనులకు లేకపోవడం అన్యాయ మన్నారు మాకు చేప్పులు వద్దు రోడ్లే ముద్దు అని గిరిజనులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు, మాడుగుల నియోజకవర్గంలో గిరిజన గ్రామాలకు రోడ్ల సమస్యలపై దృష్టిసారించి రోడ్ల సౌకర్యం కల్పించాలని వెంకన్న ప్రకటనలో డిమాండ్ చేశారు.

వ్యాపారి హత్య కేసుపై విచారణ వేగవంతం : సిఐ

- పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగింత
- రాజకోడూరులో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో చినకలవలాపల్లికి చెందిన జల్లి తాతారావు(65) అనే వడ్డీ వ్యాపారి హత్య కేసులో విచారణను వేగవంతం చేస్తున్నట్లు సిఐ నర్సింహరావు అన్నారు. హత్యపై విచారణ చేపట్టి, మంగళవారం మృతదేహన్ని రక్త సంభదీకులకు అప్పగించామన్నారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఆదేశాల మేరకు పరవాడ డిఎస్పీ విష్ణు స్వరూప్ పర్యవేక్షణలో హత్య చేసిన హంతకులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, హత్య కేసును త్వరగా ఛేదించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే మండలంలో రాజకోడూరు గ్రామంలో రావి బాబుజి(32)అనే వ్యక్తి అప్పుల బాధను తాళలేక తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నట్టు ఎస్సై నాగేంద్ర తెలిపారు. ఈ ఘటనపై తండ్రి అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా వెంకన్నపాలెం షిర్డిసాయి 26వ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు జరిపిన గోవాడ సుగర్స్ ఎం.డి., అధికారులు

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని వెంకన్నపాలెంలో గల గోవాడ సుగర్స్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న శ్రీ షిర్డిసాయి దేవాలయం 26వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోవాడ సుగర్స్ ఎం.డి. వి. సన్యాసినాయుడు, వ్యవసాయ అధికారులు ఎస్.వి.నాగేశ్వరరావు తదితరులు తొలి, ప్రత్యేక పూజలు జరిపారు. వేకువ జామునే సాయినాధునికి కాకడ హారతి, సంకల్పం, విఘ్నేశ్వరుని పూజ, రక్షాధారణ, పరిషత్తు, మహన్యాస పఠనం, పంచామృతములతో విశేష అభిషేకం, స్వామివారికి పట్టు పీతాంబరాలతో విశేష అలంకరణ, సహస్రనామావళి అర్చనలు జరిపించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి విశేష అన్న సమారాధన నిర్వహించారు. సాయి సంకీర్తనలు, వేద పారాయణం తో తిరువీధి ఉత్సవం, పల్లకీ సేవ, నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవాడ చక్కెర కర్మాగారం కార్మిక సంఘం నాయకులు కె. భాస్కరరావు, అధికారులు, సిబ్బంది సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

విశాలాంధ్ర- సబ్బవరం: ఎస్సీ వర్గీకరణ చట్టం రాష్ట్రం అసెంబ్లీలో ఆమోదం పొందడం జరిగింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని సాయినగర్ కాలనీలో మంగళవారం పెందుర్తి నియోజకవర్గం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ ఇందుగుబిల్లి గోపి, సబ్బవరం మండలం కన్వీనర్ బొర్రా జయరాజు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాల్లో భాగంగా వర్గీకరణ విజయసారథి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విజయోత్సవ సంబరాలు నిర్వహించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ అధ్యక్షులు గొటివాడ స్రామాట్ కుమార్ మాట్లాడుతూ మాదిగ జాతి 30 ఏళ్ళ చిరకాల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరింది అని, జాతి లక్ష్యాన్ని చేరుకునే విషయంలో ఎన్నో బాధలు, అవమానాలు, దుఃఖాన్ని దిగమింగి జాతిని విజయ తీరాలకు చేర్చిన పోరాటయోధుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకి జాతి మొత్తం రుణపడి ఉంటుంది అని తెలిపారు. ఈ సందర్భంగా వర్గీకరణ విచారణ జరుగుతున్న సందర్భంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం నుండి వర్గీకరణకు అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేసేందుకు కృషి చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు జరిగినందుకు పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం మండలం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు నీటిపల్లి ముత్యాలు, గొటివాడ సన్యాసి, దువ్వ దుర్గాలు, కొమ్ము కోటి, ఇందుగుబిల్లి పరదేశి, నీటిపల్లి సోమేశ్వర రావు, దువ్వ మనోహర్, కణితి సింహాచలం, చిన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల మత్స్యకారులతో అధికారుల సమావేశం

విశాలాంధ్ర-యస్.రాయవరం : నేవీ బేస్ నిర్మాణం నిర్వాసిత మత్స్యకారులతో రెవిన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. మంగళవారం మండలంలో వాక పాడు పంచాయతీ బంగారమ్మ పాలెం గ్రామంలో మత్స్యకారులతో ఎస్ ఎవోబి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ సమావేశం అయ్యారు ఈ సందర్భంగా మత్స్యకారులు ముఖ్యమైన తమ డిమాండ్లను అధికారుల ముందు ఉంచడం జరిగింది .గ్రామాన్ని తరలించే అవకాశం ఉందా అని ప్రశ్నించగా ఎస్ డి సి ఇప్పట్లో ఏమీ లేదని అన్నారు. గ్రామాన్ని తరలించిన గ్రామం నిర్మించే సమీపంలోనే జెట్టి నిర్మాణం కూడా పూర్తి చేయాలని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా నిలిపివేయడం జరిగితే ప్రతి నెల కుటుంబానికి 40 వేల రూపాయలు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు మత్స్యకారులు చెప్పిన పలు విషయాలను అధికారులు నమోదు చేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎస్‌డిసి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఏ.విభూషణరావు, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస రావు, ఎంపిటిసి మాథవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలి

విశాలాంధ్ర-విజయనగరం : అనుమతులు ఉన్న అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం 37, 38 సచివాలయాల పరిధిలో కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డా.కొండపల్లి సాంబమూర్తి, ఇతర ప్రజారోగ్య సిబ్బంది పర్యటించి పారిశుధ్య పనితీరుతో పాటు ట్రేడ్ లైసెన్సుల విధింపు ప్రక్రియను చేపట్టారు. ఆయా ప్రాంతాలలో ఖాళీ స్థలాలలో చెత్తాచెదారాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిని ప్రజారోగ్య అధికారి డా. కొండపల్లి సాంబమూర్తి మందలించారు. కాలువలు కూడా అపరిశుభ్రతగా ఉండడాన్ని గమనించి మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆయా ప్రాంతాలలో ఉన్న పలు విద్యాసంస్థలు, కళాశాలల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ లను విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని అన్నారు. ఇప్పటికే కలిగి ఉన్న ట్రేడ్ లైసెన్స్ లను రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. ఖాళీ స్థలాలను నిరుపయోగంగా ఉంచడం వల్ల స్థలాలు అపరిశుభ్ర వాతావరణన్ని కలిగిస్తున్నాయన్నారు. ఖాళీ స్థలాలలో ప్రతి ఒక్కరూ చెత్తాచెదారాలను వేయడం వల్ల దుర్గంధ భరిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. కావున ఖాళీ స్థలాల యజమానులు తప్పనిసరిగా తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూడాలన్నారు.

గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర సస్యశ్యామలం చేస్తాం

- ప్రాధాన్యతా క్రమంలో జలవనరుల అభివృద్ధి
- గత ఐదేళ్ళలో జలవనరుల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసారు
- జిల్లాలోని సూక్ష్మ, మధ్య తరహా, భారీ ప్రాజెక్టులపై మంత్రి డా. నిమ్మల రామానాయుడు సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం/రాజాం : పోలవరం ప్రాజెక్ట్ ను పూర్తి చేసి గోదావరి నదీ జలాలతో ఉత్తరాంధ్రా ను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసి గోదావరి నుండి వంశధార వరకు అనుసంధానం చేయడం ద్వారా ఉత్తరాంధ్ర కు సాగు నీరందిస్తామన్నారు. అందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో 6500 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం మంత్రి తారకరామా తీర్థసాగర్ బేరేజ్ ను సందర్శించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జలవనరుల శాఖ అధికారులతో జిల్లాలోని సూక్ష్మ, మధ్య తరహా, భారీ ప్రాజెక్టులపై సమీక్షించారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై స్వర్గీయ ఎన్.టి.ఆర్ నుండి నేటి చంద్రబాబునాయుడు వరకు ప్రత్యేక శ్రద్ధ చూపారని, గత ఐదేళ్ళలో నిర్లక్ష్యం వహించి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని, కనీసం నిర్వహణ కూడా కరువైందని అన్నారు. ఇకపై నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని, జలవనరుల అధికారులు కూడా పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి సకాలంలో పూర్తిచేయడానికి కృషి చేయాలనీ తెలిపారు. తారకరామా తీర్థ సాగర్ బేరేజ్ పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయని, ఈప్రాజెక్ట్ పూర్తిచేస్తే విజయనగరం పట్టణానికి తాగు నీరు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు నీటి సరఫరాకు అవకాశం ఉంటుంది కావునా అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా ఎటువంటి సమస్యలైనా ఉంటె శాసన సభ్యుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నెల్లిమర్ల శాసన సభ్యులు లోకం మాధవి మాట్లాడుతూ కుమిలి, సారిపల్లిలో ఆర్ అండ్ ఆర్ వేగవంతం చేయవలసిన అవసరం ఉందని తెలుపగా మంత్రి స్పందిస్తూ భూసేకరణకు పరిహారంకు సంబంధించిన అంశాలు 2 నెలల్లోగా పరిష్కరించాలని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్ట్ సమీక్ష లో డిస్ట్రిబ్యూటరి మీదనున్న మైనర్, సబ్ మైనర్ పనులను వేగంగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. రాజం శాసనసభ్యులు కోండ్రు మురళీ మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 25 వేల ఎకరాలకు సాగునీరందవలసి ఉండగా 20 వేల ఎకరాలకు మాత్రమే సాగునీటి సరఫరా జరుగుతోందని, నీటి వినియోగం సక్రమంగా జరగడం లేదని, లస్కర్లను నియమించాలని మంత్రిని కోరారు. తోటపల్లి ప్రాజెక్ట్ కు సంబంధించి పార్వతీపురం డివిజన్‌లో 8 పనులు, రాజాం, చీపురుపల్లి లో 4 పనులు జరుగుతున్నాయని, ఏయే దశలలో ఉన్నాయని సంబంధిత అధికారులను మంత్రి ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు పని చేయకపోతే నోటీసు లు జారీ చేసి, బ్లాక్ లిస్టు లో పెట్టాలని, పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అధికారుల పై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఆపరేషన్ అండ్ మైంటైనెన్స్ క్రింద 49 పనులకు ప్రతిపాదనలు పంపినట్లు రాజాం డి.ఈ తెలుపగా ప్రాజెక్టుల పనులను సంబంధిత శాసనసభ్యుల దృష్టిలో పెట్టి ప్రతిపాదనలు చేయాలనీ, పనుల ప్రగతిని కూడా శాసన సభ్యుల వారికి తెలియజేయాలని మంత్రి సూచించారు. మద్దువలస జలాశయం సమీక్షలో పూడికతీత, లైనింగ్, గుర్రపుడెక్క తొలగింపునకు ప్రతిపాదనలు పంపినట్లు డి.ఈ తెలుపగా ఈ ప్రాజెక్ట్ పరిధిలో 5వేల ఎకరాల్లో గుర్రపు డెక్కతొలగింపు అత్యవసరమని శాసన సభ్యులు కొండ్రు మురళీ తెలిపారు. మంత్రి స్పందిస్తూ గుర్రపు డెక్క తొలగింపునకు డ్రోన్ల ద్వారా స్ప్రే చేయడం సులువైన మార్గమని తెలిపారు. జంఝావతి ప్రాజెక్ట్ విషయంలో ఉన్న అంతర్ రాష్ట్రీయ సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సరైన పరిష్కారం చేస్తామన్నారు. వట్టిగెడ్డ జైకా నిధుల నుండి చెల్లింపులు కాలేదని, రాష్ట్రం చెల్లించవలసిన వాటాను గత ప్రభుత్వం చెల్లించలేదని అందువలన 16వేల ఎకరాలకు అందవలసిన నీరు అందడం లేదని తెలిపారు. నారాయణపురం ఆనకట్ట క్రింద నున్న సాయన్న గెడ్డ క్రింద భూములు ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నాయని, దీనిపై దృష్టి పెట్టాలని ఎం.ఎల్.ఏ కోండ్రు మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రతిపాదనలు పెట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. గజపతినగరం కెనాల్ ప్రీ క్లోజర్ అయ్యిందని, రైవైజెడ్ ప్రతిపాదనలు పంపాలని, కొత్తగా పరిపాలనా ఆమోదం పొందవలసి ఉందని తెలిపారు. తారకరామా తీర్థసాగర్‌ను పూర్తి చేసి విజయనగరం పట్టణానికి, భోగాపురం ఎయిర్‌పోర్టుకు నీరందిస్తామని తెలిపారు. పోలవరం పూర్తి చేసి లెఫ్ట్ కెనాల్ ద్వారా జూన్ కల్లా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా నీరందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఎం.ఎల్.సి వేపాడ చిరంజీవిరావు, విజయనగరం ఎం.ఎల్.ఏ అదితి గజపతి రాజు, మార్క్ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, ఈ.ఎన్.సి ఎం.వెంకటేస్వర్రావు, నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ డి.రం గోపాల్, విజయనగరం బొబ్బిలి ఎస్.ఈ లు స్వర్ణ కుమార్, అప్పారావు, అన్ని ప్రాజెక్టుల డి.ఈ., ఏ.ఈలు పాల్గొన్నారు.

ఆన్లైన్ బెట్టింగులపై అవగాహన

విశాలాంధ్ర-గజపతినగరం : ఆన్లైన్ బెట్టింగులపై ప్రజలు అప్రమత్తంగా మెలగాలని గజపతినగరం ఎస్సై కే లక్ష్మణరావు కోరారు. సోమవారం సాయంత్రం మండలంలోని ముచ్చర్ల గ్రామంలోని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఆన్లైన్ బెట్టింగులతో పాటు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. యువత ఆర్థిక ఆరోగ్యపరంగా హాని కలిగించే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

పైడితల్లమ్మకు పుష్పాలంకరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయానికి మంగళవారం కావడం తో భక్తులు వనం, చదురు దేవాలయాల వద్దకు తెల్లవారి నుండి విచ్చేశారు .ఉదయం చదురు గుడిలో అమ్మవారి కి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.కనకాంబరాలు, మల్లె, గులాబీ పూలతో అలంకరణలు చేసారు. ఆలయ ప్రాంగణంవద్ద మహేంద్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా బిపి, షుగర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారికి పంచహారతులు సేవలు నిర్వహించారు. దేవాలయం వద్దకు విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, బంటుపల్లి వెంకట రావు పూజలు చేశారు. ఆలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

ఈనెల 30న పోలిసెట్ పరీక్ష

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 30న పోలిసెట్ పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి తెలిపారు. మంగళవారం అయన ఛాంబర్ లో పోలిసెట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల పై సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 8083 మంది అభ్యర్థులు 23 కేంద్రాల్లో హాజరు కానున్నారని, విజయనగరంలో 9 కేంద్రాలు, బొబ్బిలిలో 6 కేంద్రాలు, గజపతినగరం లో 8 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల కు అవసరమగు బస్సులను ఏర్పాటు చేయాలనీ ఆర్.టి.సి వారికీ తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖాదికారులకు సూచించారు. వేసవి ని దృష్టిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్సకు అవసరమగు మందులను, ఓ.ఆర్.ఎస్ పాకెట్లను ఏర్పాటు చేయాలనీ డి.ఎం.హెచ్.ఓకు ఆదేశించారు. రెవిన్యూ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని, డి.ఈ.ఓకు, పరీక్షా కేంద్రాలవద్ద తాగు నీరు ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ కమీషనర్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలనీ పోలీస్ శాఖ వారికీ సూచించారు. ఈ సమావేశంలో ఆర్.టి.సి. విద్యుత్, పోలీస్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీశ్రీ వ్యూహ లక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-యలమంచిలి : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో మైహెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) శ్రీనగర్ కాలనీలో మంగళవారం శ్రీశ్రీశ్రీ వ్యూహ లక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో తేది. 20.04.2025 నుండి తేది. 23.04.2025 వరకు జరుగుతున్న ఘనంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవములలో భాగంగా 3వ రోజు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహెూత్సవము అంగ రంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి సమక్షంలో నిర్వహించడమైనదని ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి. రామస్వామి అన్నారు. ఈ కార్యక్రమములు మైహెూమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతలు, మైహెూమ్ గ్రూప్ వైస్ చైర్మన్ వినోద్ బాబు, మైహెూమ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్ రావు, మైహెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆపరేషన్స్ పాండే, యలమంచిలి నియోజికవర్గం ఎమ్.ఎల్.ఎ సుందరపు విజయ్ కుమార్, ఎక్స్ ఎమ్.ఎల్.ఎ కన్నబాబు రాజు, ఇతర అధికారలు, గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భాం శ్రీరవితేజలో వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో గర్భాం శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విజినిగిరి శంకర్ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక అభివృద్ధికి,వ్యక్తిత్వ వికాసానికి, ఐక్యతకు వార్షికోత్సవాలు దోహదపడతాయని అన్నారు. పాఠశాల అడ్వైజరీ బోర్డ్ ప్రతినిధి చింటు చిరంజీవి మాట్లాడుతూ రవితేజ ఇంగ్లీష్ మీడియం లో చదివిన విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు కైవసం చేసుకుంటున్నారని, ఈ పాఠశాల గ్రామానికి మంచి పేరును తీసుకువస్తుందని అన్నారు. రిలీవ్ అయిన ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలకు ఆ పేరును కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంధ్య, శైలజ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నైతిక విలువతో కూడిన విద్య అభ్యసించాలని, ప్రతి ఒక్క విద్యార్థి ఉపాధ్యాయులకి గురువులకు, తల్లిదండ్రుల కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వద్దా. హేమాస్ రావు, ఉపాధ్యాయులు శంకర్, శిరీష, రమ, సంధ్య,శైలజ, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులలో మరింత విస్తృత అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం : ఆస్తి పన్ను చెల్లింపులలో ప్రభుత్వ కల్పించిన వడ్డీ మాఫీ, రిబేటు సౌకర్యాలపై ప్రజలలో మరింత విస్తృత అవగాహన కల్పించి శతశాతం పన్నులు వసూలయ్యే విధంగా చూడాలని రెవెన్యూ సిబ్బందికి, అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అద్భుతమైన అవకాశాన్ని ప్రజలకు కల్పించిందన్న విషయాన్ని ప్రజలకు వివరించి తక్షణమే అధిక శాతం పన్నులు వసూలు అయ్యే విధంగా చూడాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా ప్రభుత్వం రాయితీ సౌకర్యాలకు అవకాశం ఇచ్చిందని కావున ఆస్తి మరియు ఖాళీ స్థలముల పన్నులను అధిక సంఖ్యలో చెల్లింపులు జరిగే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కే అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు అప్పలరాజు, కిరణ్, వినోద్, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

శారద నదిలో మునిగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని అంబేరుపురం గ్రామానికి చెందిన నందికొల్ల దేముడు (42) వ్య.కూ. గేదెలను తోలుకొని, వాటిని మేపడానికి అని శారదా నది ఒడ్డున ఉన్న అంబేరుపురం స్మశానం దగ్గరికి వెళ్లగా, ప్రమాదవశాత్తు శారదా నదిలో మునిగి, చనిపోయినట్టు స్థానికులు, పోలీసులు తెలిపారు. కుటుంభ సభ్యులు రిపోర్టుపై చోడవరం పోలీస్ స్టేషన్ ఏ. ఎస్సై గోవిందరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేసీఎల్ వద్ద కూడా కొలిక్కిరాని జిందాల్ చర్చలు..

- జేసీఎల్ ఎదుట పరిస్థితి వివరించిన కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు
- సమన్వయం దిశగా 28న పరిశ్రమలో చర్చలు జరపాలని సూచన
- 2న మళ్ళీ ఇరువర్గాలతో చర్చలకు పిలుపు

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలంలోని అప్పన్నపాలెం వద్దనున్న జిందాల్ పరిశ్రమ ఇటీవల మూతపడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఏ విధమైన ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధాంతరంగా యాజమాన్యం పరిశ్రమను మూసివేసిందంటూ కార్మికులు ఆందోళనకు దిగారు. దీంతో విజయనగరం డిసీఎల్ కార్యాలయంలో ఇటీవల చర్చలు జరిగాయి. మళ్ళీ మంగళవారం సాయంత్రం మరోమారు విశాఖపట్నంలోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్(జేసిఎల్) వారి కార్యాలయంలో జేసిఎల్ రామారావు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు నిర్వహించారు. పరిశ్రమ నిర్వహణకు గానూ ముడిసరుకుల దిగుమతి, రవాణా, విద్యుత్ చార్జీల భారం, యాజమాన్యం పడుతున్న వివిధ రకాల ఇబ్బందులను జిందాల్ యూనిట్ హెడ్ దినేష్ శర్మ, పరిశ్రమ డిజిఎం(హెచ్ఆర్) గోపాలకృష్ణ చర్చల్లో వివరించగా... ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా లేఆఫ్ ప్రకటించడం చట్టవిరుద్ధమని, పరిశ్రమను తక్షణమే తెరిచి కార్మికులందరికీ పనులుకల్పించాలని...లేకుంటే పరిశ్రమ మూసి ఉన్నప్పటికీ తెరిచేవరకూ కార్మికులకు పూర్తీ వేతనాలు చెల్లించాల్సిందేనని కార్మిక సంఘాల ప్రతినిధులు, సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, నమ్మి చినబాబు, పి.ఈశ్వరరావు, టిఎన్టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్సార్టియు నాయకులు లాగుడు వామాలు తదితరులు తమ పరిస్థితిని జేసిఎల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సుధీర్ఘాంగా జరిపిన చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఇరువర్గాల అభిప్రాయాలను విన్న జేసిఎల్ రామారావు ఈనెల 28న పరిశ్రమలో మరో మారు రెండు వర్గాలు సమన్వయం దిశగా సమావేశమయ్యి చర్చలుజరపాలని సూచించారు. ఏ మేరకు నిర్ణయాలు తీసుకున్నారో అనే అంశాలపై మే 2న జేసిఎల్ లో చర్చలకు కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు.